సాక్షి సూర్యాపేట

గురువారం । 30 । జనవరి । 2025



అధ్యాపకుల బడిబాట
రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచడానికి ఇంటర్ బోర్డు చర్యలు చేపట్టింది. - 8లో



గిరిజన విద్యార్థినులకు అస్వస్థత
సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గిరినగర్ గిరిజన బాలికల హాస్టల్‌లో ఐదుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. - 8లో



దొంగల ముఠా అరెస్ట్
బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్న నలుగురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను భువనగిరి పోలీసులు పట్టుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట) : జైలులో ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సబ్ జైలును ఆమె సందర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆహారం, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జైలు సూపరింటెండెంట్ సుధాకర్ రెడ్డికి సూచించారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ఖైదీలు జిల్లా న్యాయసేవాధికార కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారికి ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

ఫిర్యాదులపై త్వరగా స్పందించాలి

సూర్యాపేటటౌన్ : ఫిర్యాదులు పెండింగ్ లేకుండా త్వరగా స్పందించి దర్యాప్తు చేయాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, డీఎస్పీలు రవి, శ్రీధర్ రెడ్డి, నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం పాల్గొన్నారు.

రెండు మహిళా శక్తి సోలార్ యూనిట్లు మంజూరు

హుజూర్‌నగర్‌రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రెండు మహిళా శక్తి సోలార్ యూనిట్లు మంజూరు చేసినట్లు డీఆర్‌డీఓ అప్పారావు వెల్లడించారు. హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలోని ప్రభుత్వ స్థలంలో మహిళాశక్తి సోలార్ యూనిట్ స్థాపనకు స్థలాన్ని ఎంపీడీఓ పిండిప్రోలు లావణ్యతో కలిసి బుధవారం ఆయన పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఐబీ లక్ష్మీనారాయణ, ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్, ఏపీఎం స్వరూపరాణి, సీసీ పరిమళ, ఆర్‌ఐ షరీఫ్, కార్యదర్శి పి. పద్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీను, వీఓఏ సైదులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కమిటీలో నలుగురికి చోటు



మల్లు లక్ష్మి



మల్లు నాగార్జున్‌రెడ్డి



నెమ్మాది వెంకటేశ్వర్లు



కొలిశెట్టి యాదగిరిరావు

భానుపురి (సూర్యాపేట) : సీపీఎం రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి నలుగురికి చోటు దక్కింది. ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ రాష్ట్ర మహాసభలో సూర్యాపేటకు చెందిన మల్లు లక్ష్మి మూడోసారి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం సీపీఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న మల్లు నాగార్జున్ రెడ్డి మూడవసారి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. వీరితో పాటు నూతనంగా రాష్ట్ర కమిటీ సభ్యులుగా నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావులను ఎన్నుకున్నారు. తమ ఎన్నికకు సహకరించివారికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

అందుబాటులో సమృద్ధిగా ఎరువులు

పెన్‌పహాడ్: జిల్లాలో రైతులకు సమృద్ధిగా ఎరువులను అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం అనంతారం సహకార సంఘాన్ని సందర్శించారు. సొసైటీలో ఉన్న ఎరువులు, యూరియా నిల్వల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అందుబాటులో ఉన్న రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ అనిల్‌కుమార్, ఏఈఓ శ్రావణి, సంఘం సభ్యులు సతీష్, లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చెట్లల్లో నిఘా!

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు చెట్ల మధ్య కన్పించకుండా పోతున్నాయి. ప్రధానంగా కొత్తబస్టాండ్ నుంచి శంకర్‌విలాస్ సెంటర్ వరకు, పాత బస్టాండ్ నుంచి ఎస్వీ డిగ్రీ కళాశాల వరకు గల ప్రధాన రహదారి వెంట ఈ నిఘా నేత్రాలను అమర్చారు. డివైడర్‌పై పెంచిన మొక్కలు మొక్కలు పెరిగి పెద్దవై సీసీ కెమెరాలకు అడ్డుగా ఉన్నాయి.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సూర్యాపేట







2న కబడ్డీ జట్టు ఎంపిక

నేరేడుచర్ల : సూర్యాపేట జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టును ఫిబ్రవరి 2వ తేదీన నేరేడుచర్లలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపిక చేయనున్నట్లు సూర్యాపేట జిల్లా అడహక్ కమిటీ చైర్మన్ రామినేని భూలోకరావు, కన్వీనర్ కర్తయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 4 నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్‌లో జరగనున్న సీనియర్ పురుషుల రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో క్రీడాకారులు 85 కేజీల బరువు కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి సమాచారం కోసం సెల్ నంబర్ 9440363324ను సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు మోగిన నగారా

షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం

- ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్
- 27న పోలింగ్, మార్చి 3న కౌంటింగ్
- మార్చి 29వ తేదీతో ముగియనున్న ప్రస్తుత ఎమ్మెల్సీ పదవీకాలం
- ప్రధాన సంఘాల నుంచి ఇప్పటికే ఖరారైన అభ్యర్థులు
- ఇక ముమ్మరంకానున్న ప్రచారం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం మార్చి 29వ తేదీతో ముగియనుంది. ఆలోపే ఎన్నిక నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణను ఎన్నికల సంఘం పూర్తి చేసింది. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ రోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఫిబ్రవరి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. 27న పోలింగ్ జరగనుంది. మార్చి 3వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు. మార్చి 8వ తేదీతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది.

జిల్లాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు..

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
సిద్దిపేట	4	120	43	163
జనగామ	12	556	365	921
హన్మకొండ	15	2884	2214	5098
వరంగల్	13	1381	844	2225
మహబూబాబాద్	16	1083	535	1618
భూపాలపల్లి	7	211	112	323
ములుగు	9	394	218	612
భద్రాద్రి	23	1038	911	1949
ఖమ్మం	24	2300	1655	3955
భువనగిరి	17	595	326	921
సూర్యాపేట	23	1690	947	2637
నల్లగొండ	37	2688	1795	4483
మొత్తం	**200**	**14940**	**9965**	**24905**

ముమ్మరం కానున్న ప్రచారం

ఉపాధ్యాయ సంఘాలు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. ఇంకా కొన్ని సంఘాలు చేయాల్సి ఉంది. ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డినే యూటీఎఫ్ తమ అభ్యర్థిగా ప్రకటించింది. పీఆర్‌టీయూ–టీఎస్ అభ్యర్థిగా పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ అనుబంధ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) తరఫున పులి సరోత్తంరెడ్డి ఖరారయ్యారు. ఇక కాంగ్రెస్ నుంచి అధికారికంగా ఇంతవరకు ఎవరికీ మద్దతు ప్రకటించలేదు. అయితే, కాంగ్రెస్ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆర్‌యూపీపీ, ఎస్‌ఎల్‌టీఏ తదితర ఉపాధ్యాయ సంఘాలు ఆయనకు మద్దతు ప్రకటించాయి. టీపీయూఎస్ అధ్యక్షునిగా పనిచేసిన సాయిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కూడా పోటీ చేయనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం వారంతా ఉపాధ్యాయులను, సంఘాల నేతలను కలుస్తూ మద్దతు కూడగట్టే పనిలో పడ్డారు. వరంగల్‌కు చెందిన సుందర్‌రావు కూడా పోటీచేయనున్నట్లు తెలిసింది.

పెరిగిన ఓటర్లు

ఈసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరిగింది. గతంలో 22,554 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం అది 24,905కు చేరుకుంది. ఎన్నికల సంఘం గత సంవత్సరం డిసెంబరు 30న తుది ఓటరు జాబితాను ప్రకటించింది. మొత్తం అర్హులైన ఉపాధ్యాయ ఓటర్లు 24,905 మంది ఉండగా, అందులో మహిళా ఓటర్లు 9965 కాగా, పురుష ఓటర్లు 14,940 మంది ఉన్నారు.

అధికారిక ప్రారంభోత్సవాలకు బ్రేక్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారిక ప్రారంభోత్సవాలకు బ్రేక్ పడనుంది. సాధారణ ఎన్నికలకు వర్తించే అన్ని రకాల ఎన్నికల నిబంధనలు ఈ ఎన్నికల్లోనూ అమల్లో ఉంటాయి. ఓటర్లను ప్రభావితం చేసేలా విధానపరమైన నిర్ణయాలు, ప్రాజెక్టులు, పథకాలు ప్రారంభించడానికి వీల్లేదు. ఎన్నికల సంఘం అనుమతి లేకుండా ఎలాంటి బదిలీలు, నియామకాలు చేపట్టడానికి వీల్లేదు.

రిటర్నింగ్ అధికారిగా నల్లగొండ కలెక్టర్

వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా (ఆర్వో) నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వ్యవహరించనున్నారు. ఈ నియోజకవర్గం పరిధిలోకి 12 జిల్లాలు వస్తున్నాయి. నల్లగొండ మినహా మిగతా 11 జిల్లాల్లో అసిస్టెంట్ రిటర్నింగ్ (ఏఆర్వో) అధికారులు ఉంటారు. సాధారణంగా రిటర్నింగ్ అధికారి ఉన్న దగ్గరే నామినేషన్లను స్వీకరిస్తారు. అయితే ఈ ఎన్నికలు 12 జిల్లాల పరిధిలో ఉన్నందున ఆర్వో ఉండే నల్లగొండలో మాత్రమే స్వీకరిస్తారా? మిగతా జిల్లాల్లోని ఏఆర్వోల కార్యాలయాల్లో స్వీకరించేందుకు అనుమతి ఇస్తారా? అన్నది ఎన్నికల నోటిఫికేషన్‌లో స్పష్టం చేయనున్నారు.

ఎత్తిపోతల పథకాలకు భూసేకరణ పూర్తి చేయాలి

- భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్ కృష్ణారెడ్డి, చిత్రంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలోని నాలుగు కొత్త ఎత్తిపోతల పథకాలకు భూసేకరణ పనులు త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో ఇరిగేషన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు పాలకవీడు మండలంలో బెట్ట తండా లిఫ్ట్ ఇరిగేషన్, చింతలపాలెం మండలంలో రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్, కోదాడ మండలంలో రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్, అనంతగిరి మండలంలో ఉత్తమ్ పద్మావతి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మంజూరైనట్లు వెల్లడించారు. వీటి కోసం భూసేకరణను వేగవంతం చేసి ఇరిగేషన్ శాఖకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. రాంబాబు, ఇరిగేషన్ ఎస్‌ఈ శివధర్మతేజ, కోదాడ, హుజూర్‌నగర్ ఈఈలు సత్యనారాయణ, రామకిశోర్, డీఐఓ ప్రేమ్ చంద్, భూ సేకరణ విభాగం సూపర్ సీనియర్ అసిస్టెంట్ ఆకాష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో పొగలు

- తప్పిన పెనుప్రమాదం

మునగాల: మునగాల మండలంలోని జగన్నాథపురం శివారులో బుధవారం ఆర్టీసీ బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగా పొగలు వచ్చాయి. నడిగూడెం మండలం కరివిరాలలో గల ఆదర్శ పాఠశాల విద్యారర్థుల సౌకర్యార్థం కోదాడ డిపో నుంచి ఉదయం, సాయంత్రం బస్సు సర్వీసు నడుపుతున్నారు. బుధవారం కోదాడ నుంచి బయల్దేరిన ఆర్టీసీ బస్సు నడిగూడెం మీదుగా విద్యార్థులను ఎక్కించుకొని కరివిరాలలోని పాఠశాలకు బయల్దేరింది. నడిగూడెం–జగన్నాథపురం గ్రామాల మధ్య బస్సు ఇంజన్‌లో అకస్మాత్తుగా పొగలు రావడంతో డ్రైవర్ గమనించి కండక్టర్‌కు సమాచారం ఇచ్చాడు. వారిద్దరు విద్యార్థులను బస్సులో నుంచి దింపడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న జగన్నాథపురం గ్రామ మాజీ సర్పంచ్ వెంపటి భీష్మారావు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామ పంచాయతీ ట్రాక్టర్ సాయంతో విద్యార్థులను సకాలంలో పాఠశాలకు చేర్చారు.



విద్యార్థులను ట్రాక్టర్‌లో పాఠశాలకు తరలిస్తున్న స్థానికులు

నేత్రపర్వంగా సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజలు నేత్రపర్వంగా సాగాయి. వేకుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. ఇక ప్రథమ ప్రాకార మండపం, ముఖ మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం జరిపించి ఆలయాన్ని మూసివేశారు.

ఆపరేషన్లు లేకుండా కాన్పులు చేయాలి

- రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

నాగార్జునసాగర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు లేకుండా సహజ కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథి గృహంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట డీసీహెచ్‌ఎస్‌లు, ఏరియా ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు.ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగేలా సేవలందించాలన్నారు. అంతకు ముందే నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిని సందర్శించి అక్కడ అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్‌లు మాతృనాయక్, చిన్నానాయక్, వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్లు డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ భానుప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతలో పశువులూ భాగమే



కోదాడలో ర్యాలీ నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు, విద్యార్థులు

- జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌రావు

కోదాడరూరల్ : పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో పశువులు కూడా భాగమేనని వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలో పశుసంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మూగ జీవాల సంరక్షణపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన అనంతరం మాట్లాడారు. అడవుల శాతం తగ్గడంతోనే జంతువులు జనవాసాల్లోకి వస్తున్నాయన్నారు. అడవుల నరికివేతను అరికట్టే విధంగా కృషి చేయాలన్నారు. నూటికి 98.7శాతం ప్రజలు పశుఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటున్నారని అందువల్ల వాటిని ఆరోగ్యంగా ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్య క్రమంలో కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య, హెచ్ఎం మార్కండేయులు, పశు వైద్యులు మధు, రవి, వీరారెడ్డి, శ్రీనివాసరావు, సురేందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాకీల్లో అవినీతి జలగలు!

- పోలీస్‌స్టేషన్‌లలో ప్రతి పనికీ పైసలు వసూలు
- సివిల్ వివాదాల్లో మితిమీరిన పోలీసుల జోక్యం
- ఇసుక అక్రమ రవాణాకు సహకారం
- తాజాగా పీడీఎస్ బియ్యం కేసులో ఏసీబీకి చిక్కిన తిరుమలగిరి ఎస్‌ఐ, కానిస్టేబుల్
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నా మారని తీరు



తిరుమలగిరి: కొందరు పోలీస్ అధికారులు, సిబ్బంది తీరుతో ఆ శాఖ అప్రతిష్టను మూటగట్టుకుంటోంది. పైసలు ఇవ్వందే పనిచేయకపోవడం, ఖర్చుల పేరిట డబ్బులు డిమాండ్ చేయడం, మామూళ్ల వసూలు చేయడం, తమకు సంబంధం లేని వ్యవహారాల్లో తలదూర్చడం, ఇసుక అక్రమ రవాణాకు సహకరించడం పరిపాటిగా మారింది. ఏసీబీకి పట్టుబడినా, ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినా, వీఆర్‌లో ఉంచినా, సస్పెండ్ చేసినా వారి పనితీరులో మార్పురావడంలేదు. తాజాగా పీడీఎస్ బియ్యం కేసులో ఓ వ్యక్తి నుంచి రూ.1.40 లక్షలు డిమాండ్ చేసిన తిరుమలగిరి ఎస్‌ఐ సురేష్, కానిస్టేబుల్ ఏసీబీకి చిక్కడం కలకలం రేపుతోంది.

స్టేషన్ నిర్వహణ ఖర్చుల పేరిట..

ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూ ఉన్నతాధికారులు పదే పదే చెబుతున్నా పోలీస్ స్టేషన్‌లో పైసలు ఇవ్వనిదే పనిజరగని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ స్టేషన్‌ల నిర్వహణకు ప్రతి నెలా రూ.25 వేలు కేటాయిస్తుంది. కానీ స్టేషన్‌కు వచ్చే బాధితుల నుంచి స్టేషన్ నిర్వహణ ఖర్చుల పేరుతో పోలీసులు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో పాటు ఇసుక అక్రమ రవాణా, బెల్లం హోల్‌సేల్ వ్యాపారుల నుంచి నెల నెలా మామూళ్లు వసూలు చేస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. దాబాలు, బెల్టు షాపుల నిర్వాహకుల నుంచి కూడా డబ్బులు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా వెళుతుండటంతో కొన్ని సార్లు డబ్బులు తీసుకొని వదిలి పెడుతున్నట్లు సమాచారం. కొన్ని కేసుల విషయంలో స్టేషన్ బెయిల్ కోసం రైటర్లతో సహా లంచం తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

మరి కొన్ని ఘటనలు ఇలా..

- 2020లో నాగారం ఎస్‌ఐ లింగం సివిల్ వివాదంలో జోక్యం చేసుకోవడంతో వీఆర్‌లో ఉంచారు.
- గత సంవత్సరం తుంగతుర్తి, పెన్‌పహాడ్, ఆత్మకూర్.ఎస్‌లలో పనిచేస్తున్న ముగ్గురు ఎస్‌ఐలు ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని వీఆర్‌లో ఉంచారు.
- ఇటీవల పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.1500 మామూళ్ల పంపిణీలో కానిస్టేబుల్, హోంగార్డు ఘర్షణకు దిగడం సంచలనంగా మారింది. ఈ ఘటనతో కానిస్టేబుల్ జాటోత్ రవికుమార్, హోంగార్డు గంజి శ్రీనును విధుల నుంచి తొలగిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.
- గత నెలలో మఠంపల్లి ఎస్‌ఐ రామాంజనేయులు కోదాడకు చెందిన ఒక ఎస్‌ఆర్‌ఐ కారును రెండు రోజులు వాడుకొని ఇస్తానని చెప్పి నెలలు గడుస్తున్నా తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ఎస్‌ఐని సస్పెండ్ చేస్తూ ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.
- గరిడేపల్లిలో మోటార్ల దొంగను పట్టుకొచ్చి పోలీస్ స్టేషన్‌లో ఉంచగా ఆ దొంగ పారిపోయాడు. ఈ విషయంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.
- సూర్యాపేట పట్టణంలో ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ నాలుగు నెలల క్రితం సస్పెండ్ చేశారు. పట్టణంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లు బాలకృష్ణ, రాంబాబు, పూర్ణచందర్‌లు ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తూ వారి నుంచి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్యలకు తీసుకున్నారు.

జిల్లాకు చివరగా ఉండడంతో..

తిరుమలగిరి పోలీస్ స్టేషన్ అవినీతికి అడ్డాగా మారింది. జిల్లాకు చివరగా ఉండటంతో యాదాద్రి భువనగిరి, జనగామ, మహబూబాబాద్ జిల్లాలకు ఈ ప్రాంతం మీదుగా పీడీఎస్ బియ్యం, ఇసుక, మైనింగ్, గంజాయి లాంటివి అక్రమంగా రవాణా సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో కూడా గంజాయి పట్టుబడ్డ సంఘటనలు జరిగాయి. తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో పనిచేసి వివాదాస్పదంగా మారిన చాలా మంది పోలీస్ అధికారులపై అధికారులు చర్యలు తీసుకున్నా ఖాకీల తీరులో మార్పురావడంలేదు. కింది స్థాయి సిబ్బంది కూడా స్టేషన్‌కు వచ్చిన వారి నుంచి రూ.500 నుంచి రూ.1000 వరకు ఫిర్యాదుదారుల నుంచి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన 2015ఎస్‌ఐ రాజశేఖర్ కలప వ్యాపారుల నుంచి పోలీస్ వాహనం మరమ్మతుల కోసం రూ.50 వేలు డిమాండ్ చేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీస్ అధికారులు సస్పెండ్ చేశారు. కరోనా సమయంలో తిరుమలగిరిలో పనిచేసిన ఓ ఎస్‌ఐ హైదరాబాద్‌లో తన సొంత ఇంటి నిర్మాణం కోసం తిరుమలగిరి మండలం నుంచి ఇసుక, ఇటుకను బెదిరించి తరలించినట్లు ఆరోపణలున్నాయి. ఈ ఎస్‌ఐ మహిళలను వేధించారనే అప్పట్లో విమర్శలు కూడా వెల్లువెత్తాయి. 2022లో తిరుమలగిరిలో ఎస్‌ఐగా పనిచేసిన లోకేష్ సివిల్ వివాదంలో జోక్యం చేసుకోవడంతో సస్పెండ్ చేశారు. ఆ తర్వాత పనిచేసిన ఇద్దరు ఎస్‌ఐలు ఇసుక అక్రమ రవాణాకు సహకరించారని , సివిల్ పంచాయతీల్లో తలదూర్చారని ఆరోపణలు రావడంతో ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

క్లుప్తంగా

జాతీయ విద్యా సదస్సుకు ఆహ్వానం


బాలరాజు

డిండి: దేశ రాజధాని ఢిల్లీలో ఫిబ్రవరి 9న నిర్వహించే నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎడ్యుకేషన్ అండ్ ఇ–లెర్నింగ్ సదస్సులో పాల్గొనాలని డిండి మండలం తవక్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బాలరాజుకు ఆహ్వానం అందింది. విద్యా విధానంలోని నూతన పోకడలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఇ–లెర్నింగ్ ఆవశ్యకతపై సదస్సులో ప్రసగించనున్నట్లు బుధవారం బాలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలరాజుకు ఎంఈఓ గోప్యా నాయక్, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేష్, గణేష్, రమేష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

చెరువులో మునిగి మత్స్యకారుడు మృతి

త్రిపురారం: చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మత్స్యకారుడు మృతిచెందాడు. ఈ ఘటన నిడమనూరు మండలం వెంగన్నగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. బుధవారం నిడమనూరు ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలం వెంగన్నగూడెం గ్రామానికి చెందిన గుండు రాంబాబు(35) మంగళవారం ఉదయం గ్రామంలోని నల్ల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం రాంబాబు కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి వెతకగా.. చెరువులో తెప్ప తిరగబడి ఉండి రాంబాబు మృతదేహం కనిపించింది. చేపలు పట్టే సమయంలో తెప్ప తిరగబడడంతో రెండు కాళ్లకు వల చుట్టుకుని చెరువులో మునిగి చనిపోయినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. బుధవారం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాగులో పడి గాయాలు

ఆలేరురూరల్: బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలు వాగు దాటుతుండగా జారి పడిపోవడంతో గాయపడ్డారు. ఆలేరు పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన సందెన రామనర్సయ్య, అతడి భార్య లక్ష్మి కలిసి బైక్‌పై బుధవారం పోచన్నపేట గ్రామంలో తమ బంధువుల ఇంటికి వెళ్లి సాయంత్రం స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో కొలనుపాక వాగు దాటుతుండగా.. జారి వాగులో పడిపోయారు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో జనగామలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దవూర: మండలంలోని పాల్తీతండాలో విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. బుధవారం తండాకు చెందిన పాల్తీ లాలు తన గేదెలకు మేత కోసం వ్యవసాయ పొలాలకు తోలుకుని వెళ్లాడు. ఈ క్రమంలో ఓ గేదె ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా విద్యుత్ తీగ తగిలి షాక్‌తో మృతిచెందింది. దాని విలువ రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

అధ్యాపకుల బడిబాట

ఇంటర్‌లో అడ్మిషన్లు పెంచేలా ప్రణాళిక

- ప్రతి లెక్చరర్ మూడు పాఠశాలలను సందర్శించాలి
- టెన్త్ విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరేలా ఒప్పించాలి
- ముగ్గురు అధ్యాపకులతో జిల్లా అకడమిక్ సెల్ ఏర్పాటు
- ఒత్తిడి తగ్గించడానికి అందుబాటులో టెలీమానస్ సేవలు
- టోల్‌ఫ్రీ నంబర్ 14416కు కాల్ చేస్తే నిపుణుల సలహాలు



కోదాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచడానికి ఇంటర్ బోర్డు చర్యలు చేపట్టింది. కళాశాలల్లో పని చేస్తున్న ప్రతి అధ్యాపకుడు సమీపంలోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు కాలేజీలో చేరే విధంగా ఒప్పించాల్సి ఉంటుంది. వారికి కళాశాలల్లో అందుతున్న సౌకర్యాలు, ఉచిత పాఠ్యపుస్తకాల వంటివాటి గురించి వివరించాలి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కళాశాలల్లో మధ్యాహ్న భోజన వసతి కల్పించడానికి నిర్ణయించిన ఈ విషయాన్ని కూడా విద్యార్థులకు వివరించాలని ఇంటర్ బోర్డు ఆదేశించింది. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురవుతున్న విద్యార్థుల కోసం టోల్‌ఫ్రీ నంబర్‌తో కూడిన టెలీమానస్ సేవలను అందుబాటులోకి తెచ్చింది.

అకడమిక్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు

ముగ్గురు అధ్యాపకులతో జిల్లా స్థాయి అకడమిక్ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశారు. సూర్యాపేట జిల్లా కమిటీలో నేరేడుచర్ల లైబ్రేరియన్ జి. జానకిరాంరెడ్డి, కోదాడ, నడిగూడెం జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఎకనామిక్స్ లెక్చరర్లు ఆర్. పిచ్చిరెడ్డి, ఎస్‌కె. జానిపాషలతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. వీరు జిల్లా స్థాయిలో కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల హాజరుశాతంతో పాటు వారు స్టడీ అవర్స్‌కు హాజరవుతున్నారా లేదా, కళాశాలలో నిర్వహిస్తున్న స్లిప్ టెస్టులు రాస్తున్నారా లేదా పరిశీలించి రోజూ రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్‌కు ఆన్‌లైన్‌లో సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో జూనియర్ కళాశాలల వివరాలు..

నల్లగొండ జిల్లా	
ప్రభుత్వ, ప్రైవేట్, కస్తూర్బా, మోడల్ స్కూళ్లతో పాటు గురుకుల జూనియర్ కళాశాలలు	132
మొదటి సంవత్సరం విద్యార్థులు	16,400
రెండో సంవత్సరం విద్యార్థులు	15,600
యాదాద్రి భువనగిరి జిల్లా	
ప్రభుత్వ, కస్తూర్బా, మోడల్ జూనియర్ కళాశాలలు	25
మొత్తం విద్యార్థుల సంఖ్య	3757
ప్రైవేట్ జూనియర్ కళాశాలలు	22
మొత్తం విద్యార్థుల సంఖ్య	9121
సూర్యాపేట జిల్లా	
ప్రభుత్వ, మోడల్, సోషల్ వెల్ఫేర్, గురుకుల, కేజీబీవీ జూనియర్ కళాశాలలు	46
మొదటి సంవత్సరం విద్యార్థులు	3488
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	3671
ప్రైవేట్ జూనియర్ కళాశాలలు	26
మొదటి సంవత్సరం విద్యార్థులు	4533
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	4651

పరీక్షల వేళ.. ఒత్తిడి తగ్గించుకోండి ఇలా..



పరీక్షలు దగ్గర పడుతున్న ప్రస్తుత తరుణంలో ఇంటర్ విద్యార్థులు ఒత్తిడికి గురువుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఇంటర్ బోర్డు 14416 టోల్‌ఫ్రీ నంబర్‌తో కూడిన టెలీ మానస్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. కొందరు పరీక్షలో ఉత్తీర్ణులవుతామో లేదో, మార్కులు తక్కువగా వస్తాయో ఏమోనని ఆందోళనకు గురువుతున్నారు. ఇలాంటి వారికోసం ఇంటర్ బోర్డు టెలీమానస్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. టోల్‌ఫ్రీ నంబర్ 14416కు కాల్ చేస్తే విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడానికి నిపుణులు తగిన సూచనలు, సలహాలు ఉచితంగా ఇస్తారు. ఈ సేవలు 24గంటలు అందుబాటులో ఉంటాయి. ఇంటర్ పరీక్షలను ఎలా ఎదుర్కొవాలి, ఆందోళన లేకుండా ఏమి చేయాలనే విషయాలతో పాటు ఇంటర్ తరువాత భవిష్యత్తులో రాయదగిన పరీక్షలు, వాటికి ఎలా సన్నద్ధం కావాలో వివరిస్తారు. పరీక్షల సమయంలో సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటే కలిగే ప్రయోజనాలు, ఆరోగ్య సూత్రాలు, జాగ్రత్తలు, ఒత్తిడి లేకుండా పరీక్షలను ఎదుర్కోవడానికి కూడా వీరు సూచనలు, సలహాలు ఇస్తారు.

విద్యార్థులు టెలీమానస్ సేవలు వినియోగించుకోవాలి

ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్, మార్చి 5 నుంచి 25 వరకు థియరీ ఎగ్జామ్స్ ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులు 14416 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఉచితంగా టెలీమానస్ సేవలు పొందవచ్చు. పరీక్షలంటే భయపడుతున్న విద్యార్థులను గుర్తించిన తల్లిదండ్రులు, అధ్యాపకులు వారికి టెలీమానస్ సేవలు అందే విధంగా చూడాలి. – మద్దిమడుగు సైదులు, ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం సూర్యాపేట జిల్లా కార్యదర్శి

మత్స్యకృషీవలురాలు స్వాతికి అరుదైన గౌరవం


నీతూప్రసాద్ నుంచి మెమొంటో అందుకుంటున్న స్వాతి దంపతులు

గుర్రంపోడు: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ప్రత్యేక ఆహ్వానితురాలిగా పాల్గొన్న గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన వంపు స్వాతి, ఇద్దయ్య దంపతులను బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద చేపల చెరువులు ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తున్న ఏడుగురిని రాష్ట్ర మత్స్యశాఖ ఎంపిక చేసి గణతంత్ర వేడుకలకు తెలంగాణ తరపున పంపింది. అందులో వంపు స్వాతి ఒకరు కావడం విశేషం. గణతంత్ర వేడుకల్లో పాల్గొని కేంద్ర మత్స్యశాఖ జాయింట్ సెక్రటరీ నీతూప్రసాద్ చేతుల మీదుగా వంపు స్వాతి దంపతులు మెమొంటో అందుకున్నారు. వీరి వెంట రాష్ట్ర మత్స్యశాఖ డిప్యూటీ డైరక్టర్ ఖదీర్ అహ్మద్ ఉన్నారు.

అత్త, ఆడపడుచు వేధింపులు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

చౌటుప్పల్ రూరల్: అత్త, ఆడపడుచు వేధిస్తున్నారని బాధితురాలు బుధవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామానికి చెందిన ఎండీ ఖాజాకు ఎండీ ముబీనా బేగంతో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అదనపు కట్నం తీసుకురావాలని అత్త ఎండీ జాదాబీ, ఆడపడుచు సఫియా కలిసి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో తనపై దాడి చేశారని, మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పెడుతున్నారని ముబీనా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణమాల్ సూర తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి


రవి (ఫైల్)

తుంగతుర్తి: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తుంగతుర్తి మండలం ఎనెకుంటతండాలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనెకుంటతండాకు చెందిన భూక్య రవి(42) ఈ నెల 27వ తేదీ రాత్రి ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. బుధవారం తండా శివారులోని లాకావత్ దేవాకు చెందిన బావిలో రవి మృతదేహం కనిపించింది. ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతిచెంది ఉంటాడని తండావాసులు చర్చించుకుంటున్నారు. మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య భూక్య కైలా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

రామన్నపేట: రామన్నపేట పట్టణంలో బుధవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన నారగోని శ్రీనివాస్, రజిత దంపతులు రామన్నపేట మండల కేంద్రంలోని చిన్నమసీదు వద్ద నివాసముంటున్నారు. శ్రీనివాస్ ఐడీఎల్ కంపెనీలో పనిచేస్తుండగా.. రజిత టైలరింగ్ పనిచేస్తోంది. దంపతులు ఇద్దరు ఉదయం వేర్వేరు సమయాల్లో తమ పనులకు వెళ్లిపోయారు. సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ,50వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఎస్‌ఐ మల్లయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు


హుజూర్‌నగర్ రూరల్: గాయాలతో వెంకటరెడ్డి


నాగార్జునసాగర్: స్పృహతప్పి పడిపోయిన రాజు

హుజూర్‌నగర్‌రూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అతడికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామ శివారులో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు మిర్యాలగూడకు వెళ్తుండగా.. మార్గమధ్యలో గోపాలపురం గ్రామ శివారులో సర్వీస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో పాటు హుజూర్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తున్న గరిడేపల్లి మండలం కోనాయిగూడెం గ్రామానికి చెందిన సారెడ్డి వెంకటరెడ్డిని ఢీకొని డివైడర్ పైకి ఎక్కి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో వెంకటరెడ్డి తలకు గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

ముళ్ల కంచె తగిలి..

నాగార్జునసాగర్: రోడ్డు పక్కన ముళ్ల కంచె తగలడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దేవరకొండ మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన రమావత్ రాజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్లకు వెళ్లి తిరిగి బుధవారం ఉదయం స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో నాగార్జునసాగర్‌లోని హిల్ కాలనీ వద్ద నావీ బిల్డింగ్స్ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కన ఉన్న ఇనుప కంచె అతడి కాలికి తగిలి కిందపడిపోయాడు. ఇనుప కంచె రాజు శరీరభాగాలకు గుచ్చుకోవడంతో స్పృహతప్పి పడిపోయాడు. రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి రాజును స్థానిక కమలా నెహ్రూ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తీవ్రంగా గాయపడిన రాజుకు డాక్టర్లు 17 కుట్లు వేసినట్లు తెలిసింది. అయితే నావీ బిల్డింగ్స్ చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ ముళ్ల కంచె వేశారని, ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో వాహనదారులు ఏమాత్రం రోడ్డు దిగినా ప్రమాదాలు జరుగుతున్నాయని, ముళ్ల కంచెను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జూనియర్ అసిస్టెంట్ అదృశ్యం

- వేములపల్లి సమీపంలో సాగర్ ఎడమ కాల్వ వద్ద బైక్ గుర్తింపు


ప్రవీణ్‌కుమార్

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ఎమ్మార్వో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నూనె ప్రవీణ్‌కుమార్ అదృశ్యమయ్యాడు. మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం బెజ్జికల్ గ్రామానికి చెందిన నూనె రాములు కుమారుడు ప్రవీణ్‌కుమార్‌కు గత నెల జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం రావడంతో మిర్యాలగూడ ఎమ్మార్వో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం డ్యూటీకి వచ్చిన ప్రవీణ్‌కుమార్ రాత్రి ఇంటికి చేరుకోలేదు. ప్రవీణ్‌కుమార్‌కు అతడి తల్లిదండ్రులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారిని వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం రాత్రి 11గంటల సమయంలో వేములపల్లి సమీపంలో సాగర్ ఎడమ కాల్వ వద్ద చివరిసారిగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ చూపించగా.. అక్కడికి వెళ్లి పరిశీలించారు. అక్కడ ప్రవీణ్‌కుమార్ బైక్‌ను పోలీసులు గుర్తించారు. కాగా తన చదువుకు తగిన ఉద్యోగం రాలేదని గత కొద్దిరోజులుగా ప్రవీణ్‌కుమార్ తోటి సిబ్బంది వద్ద వాపోయేవాడని తెలిసింది. ప్రవీణ్‌కుమార్ తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు.

గిరిజన విద్యార్థినులకు అస్వస్థత

- బయట ఆహారం తిన్న ఐదుగురికి వాంతులు
- ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స.. పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ


సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గిరినగర్ గిరిజన బాలికల వసతి గృహంలో ఐదుగురు విద్యార్థినులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. గిరిజన బాలికల వసతిగృహంలో మొత్తం 270 మంది విద్యార్థినులు వసతి పొందుతుండగా బుధవారం 161 మంది విద్యార్థినులు హాజరయ్యారు. అయితే రోజు మాదిరిగానే బుధవారం ఉదయం భోజనం చేసి హాస్టల్ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. అయితే అక్కడ బ్రేక్ సమయంలో సమోసాలు అమ్ముతుండగా అవి కొనుగోలు చేసి ఐదుగురు విద్యార్థినులు తిన్నారు. అప్పటి నుంచి కడుపునొప్పి వస్తుందని, మధ్యాహ్నం భోజనం చేశాక కడుపు నొప్పి ఎక్కువై వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. 8వ తరగతికి చెందిన ఆర్.దుర్గ, డి.కనిష్క 8వ తరగతి, 6వ తరగతికి చెందిన బి.పూజిత, 9వ తరగతికి చెందిన ఎస్.మహేశ్వరి, 8వ తరగతికి చెందిన బి.అక్షిత లు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే పక్కనే ఉన్న పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యుడు చికిత్స అందించడంతో మళ్లీ స్కూల్‌కు వెళ్లగా మళ్లీ ఎక్కువగా అస్వస్థతకు గురై స్పృహ తప్పి పడిపోవడంతో వెంటనే హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో వేణుమాధవ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, డీటీడీవో శంకర్ నాయక్ ఆసుపత్రికి చేరుకుని వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో వేణుమాధవ్ మాట్లాడుతూ విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు చెప్పారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

కోదాడ: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ నిరంతరం కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ బి. మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కోదాడ పీఆర్‌టీయూ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. నల్లగొండ–ఖమ్మం–వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పింగళి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రభుత్వ రంగ విద్యాసంస్థలను బలోపేతం చేయడానికి, సీపీఎస్ రద్దు కోసం తమ సంఘం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బొల్లు రాంబాబు, రాష్ట్ర మాజీ అసోసియేట్ అధ్యక్షుడు ఓరుగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చౌటుప్పల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన బ్రహ్మం(32) తరచూ ఇంట్లో ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వివిధ ప్రాంతాలకు వెళ్తుంటాడు. అదే మాదిరిగానే బుధవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామానికి వచ్చాడు. రాత్రి సమయంలో గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బార్ ముందు జాతీయ రహదారి డివైడర్‌పై మృతిచెంది పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తుండగా.. అదే సమయంలో మృతుడి సెల్‌ఫోన్‌కు ఫోన్ రావడంతో అతడి వివరాలు తెలిశాయి. అయితే బ్రహ్మం ఎందుకు లింగోజిగూడెం వద్దకు వచ్చాడు, ఎప్పుడు వచ్చాడు వంటి వివరాలు తెలియాల్సి ఉంది. హైవే దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందినట్లుగా తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దూషించిన కేసులో ఆరు నెలలు జైలుశిక్ష

గరిడేపల్లి: దూషించిన కేసులో గరిడేపల్లి మండలంలోని కుత్బుషాపురం గ్రామానికి చెందిన గుండా లింగయ్యకు నల్లగొండ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎన్ రోజారమణి ఆరు నెలలు జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. లింగయ్య 2019లో కుత్బుషాపురం గ్రామానికే చెందిన నకిరేకంటి వెంకటయ్యతో డప్పు కొట్టే విషయమై గొడవపడి అతడిని దూషించి దాడి చేసేందుకు యత్నించాడు. వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ సైదులు లింగయ్యపై కేసు నమోదు చేశారు. అనంతరం కోదాడ డీఎస్పీలు సుదర్శన్‌రెడ్డి, రఘు ఈ కేసును దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వెంకటయ్యను దూషించినట్లు రుజువు కావడంతో లింగయ్యకు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

వైభవంగా నిత్య కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్య ధారణ, నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గరుఢ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి చలానా ఎందుకు కట్టావ్?

- కలప వ్యాపారికి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బెదిరింపు
- అసభ్య పదజాలంతో దూషించిన అధికారి
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

కోదాడరూరల్: నిబంధనల ప్రకారం చెట్లు నరికేందుకు గాను ప్రభుత్వానికి చలానా కట్టినందుకు తనను ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అసభ్య పదజాలంతో దూషించాడని ఓ కలప వ్యాపారి కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంమ ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురం తండాకు చెందిన బాణోతు శ్రీను జగ్గయ్యపేటతో పాటు కోదాడ పరిసర ప్రాంతాల్లో కలప వ్యాపారం చేస్తున్నాడు. ఆరు నెలల క్రితం ఈ విషయం తెలిసిన కోదాడ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలోని సెక్షన్ ఆఫీసర్ కబీర్ తనతో మాట్లాడుకొని 10 వాహనాలకు ఒక్కో వాహనానికి రూ.6వేల చొప్పున నెలకు రూ.60 వేలు లంచం తీసుకున్నాడని శ్రీను ఆరోపించాడు. నిబంధనల ప్రకారం కలప వ్యాపారం చేయాలని రెండు రోజుల కిందట కోదాడలోని ఫారెస్ట్ ఆఫీస్‌కు వెళ్లి ఆన్‌లైన్‌లో చలానా కట్టానని, ఈ విషయం తెలుసుకున్న సెక్షన్ ఆఫీసర్ లంచం రాదనుకున్నాడో ఏమో కాని కార్యాలయంలో ఉండగానే తనకు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించాడని వాపోయాడు. దీంతో మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలిసి కోదాడ పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపాడు.

విచారణ చేస్తాం..

ఈ విషయంపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆదిత్యను వివరణ కోరగా.. శ్రీను అనే వ్యక్తి చలానా కట్టేందుకు కార్యాలయానికి వచ్చిన మాట వాస్తవమేనని, సెక్షన్ ఆఫీసర్ అతనికి ఫోన్ చేసి దూషించాడన్న విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. అతడిపై పోలీస్ కేసు కూడా పెట్టినట్లు తెలిసిందన్నారు. విచారణ చేసి సెక్షన్ ఆఫీసర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.17లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- పరారీలో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు


వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

భువనగిరిటౌన్: మహిళలను మాటలతో మభ్యపెట్టి బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్న నలుగురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను భువనగిరి పట్టణ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సుధీర్‌బాబు భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్రతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన గుజరాతీ కిషన్, ఢిల్లీకి చెందిన రామ్‌లాల్, శ్యామ్‌లాల్, కోలి, గుల్షన్ అలియాస్ గుల్లు, దీపక్ ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో ఇద్దరు వ్యక్తులు ఒంటరిగా వెళ్తున్న మహిళలను టార్గెట్ చేసి వారిని అడ్రస్ అడుగుతూ మాటల్లో పెట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసేవారు. మరో ముగ్గురు బైక్‌లతో సమీపంలో సిద్ధంగా ఉండి అందరూ కలిసి తప్పించుకునేవారు. చోరీలకు పాల్పడే సమయంలో మహిళలను ప్రభావితం చేయడానికి ఇంద్రజాలం వాడేవారు. ఇదే తరహాలో ఈ నెల 21వ తేదీన భువనగిరి బస్టాండ్ వద్ద ఓ మహిళ మెడలో బంగారు పుస్తెలతాడు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా గుజరాతీ కిషన్, రామ్‌లాల్, శ్యామ్‌లాల్, కోలిని భువనగిరి పట్టణ శివారులో పట్టుకున్నారు. గుల్షన్ అలియాస్ గుల్లు, దీపక్ పరారీలో ఉన్నట్లు సీపీ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.17లక్షల విలువ చేసే బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పాత నేరస్తులని, వీరు దేశవ్యాప్తంగా ఇదే తరహాలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని సీపీ వెల్లడించారు. వీరిపై గతంలో పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కోర్టులో హాజరుపర్చి రిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన భువనగిరి టౌన్ ఎస్‌ఐ కె. లక్ష్మీనారాయణ, హెడ్‌కానిస్టేబుళ్లు జి. శ్రీనివాస్, కానిస్టేబుల్ బి. కొండారెడ్డి, ఎస్. రమేష్ తదితరులను సీపీ అభినందించి రివార్డులు అందజేశారు. ఈ విలేకరుల సమావేశంలో భువనగిరి ఏసీపీ కె. రాహుల్‌రెడ్డి, అదనపు డీసీపీ సీహెచ్. లక్ష్మీనారాయణ, భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ కందుకూరి సురేష్‌కుమార్, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.